

ఘనంగా సీతారాముల శ్రావణ పౌర్ణమి కల్యాణం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట
శ్రావణ పౌర్ణమి సందర్భంగా సోమవారం సీతారాములకు కల్యాణం వైభోగంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు కల్యాణం సందర్భంగా ఉభయ దాతలు పట్టు వస్త్రాలు, పూలమాలలు సమర్పించారు. టిటిడి అధికారుల సమక్షంలో ఈ కల్యాణోత్సవం ఘనంగా వేద పండితులు నిర్వహించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా రాఖీ దారములు స్వామివారికి తరుపున అందరి భక్తులకు పంపిణీ చేశారు. తీర్థప్రసాదాలు అందరికీ పంపిణీ చేశారు. ఈ కల్యాణోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. కల్యాణానికి ఒంటిమిట్ట సిఐ కృష్ణంరాజు నాయక్ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బ్యాండు వాయిద్య మేళం, టిటిడి ఆలయ ఇన్‌స్పెక్టర్, టిటిడి ఉద్యోగులు, పోలీసులు, సెక్యూరిటీ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

వేడెక్కిన జడ్‌పి రాజకీయం!

- తాడేపల్లికి చేరిన చైర్మన్ ఎన్నిక వ్యవహారం
- జగన్ బంధువు నరేన్ ఎన్నిక లాంఛనమే?
- టిడిపి సీనియర్ నాయకుడి నుంచి జడ్‌పిటిసిలకు ఫోన్‌కాల్స్
- 21న తాడేపల్లికి జడ్‌పిటిసిలు ప్రయాణం



ప్రజాశక్తి- కడప ప్రతినిధి
జిల్లా పరిషత్ రాజకీయం వేడెక్కింది. అధికార టిడిపి, వైసిపి వ్యూహప్రతివ్యూహాల మధ్య రాజకీయం నడుస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం డిసెంబర్‌లోపు జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికను నిర్వహించాల్సి ఉంది. ఆకేపాటి పోటీ చేసిన ఒంటిమిట్ట, రెండేళ్ల కిందట పులివెందుల జడ్‌పిటిసి మహేశ్వరరెడ్డి చనిపోవడంతో ఈ రెండు స్థానాలకు ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక బరిలో కమలాపురానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు జడ్‌పి చైర్మన్ ఎన్నిక రేసులో నిలవడం ఉత్కంఠను కలిగిస్తోంది. ఆయన వైసిపి జడ్‌పిటిసిలకు ఫోన్ కాల్స్ చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. టిడిపి నాయకుని వ్యూహానికి విరుగుడుగా వైసిపి తరుపున చైర్మన్‌గిరీ రేసులో నిలిచిన చింతకొమ్మదిన్నె జడ్‌పిటిసి టిడిపి నాయకుని వ్యూహాన్ని వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఇటీవల వైజాగ్ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అనుసరించిన వ్యూహాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ గిరీని దక్కించుకునేందుకు అమలు చేస్తున్నట్లు సమాచారం. మంగళవారం జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ నిర్వహించనున్నారు. స్టాండింగ్ కమిటీ నిర్వహణ అనంతరం జడ్‌పిటిసిలు తాడేపల్లికి చేరుకోవాలనే ఆదేశాలు అందినట్లు సమాచారం. ఈ నెల 21న తాడేపల్లి కేంద్రంగా వైసిపి తరుపున జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని ఖరారు కానున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం డిసెంబర్‌లోపు జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంది. వైసిపి జిల్లా పరిషత్‌లోని 51 స్థానాల్లో 50 స్థానాల్లో పూర్తి స్థాయి ఆధిక్యత కలిగి ఉంది. జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేయడంపై సందేహాలు నెలకొన్నాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్ మేనమామ, కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కుమారుడు నరేన్‌రామాంజులరెడ్డి పేరు చైర్మన్ ఎన్నిక రేసులో తెరపైకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేస్తుందా, లేక విడుదల చేయకుండానే ఇన్‌ఛార్జి చైర్మన్ జేష్టాది శారదను కొనసాగించడం వైపు మొగ్గు చూపిస్తుందా అనేది తేలాల్సి ఉంది.

ప్రజా సమస్యల పరిష్కారంలో అశ్రద్ధ చూపొద్దు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి
ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను పరిష్కరించడంలో ఎలాంటి అశ్రద్ధ చూపరాదు. నాణ్యతే ప్రామాణికంగా సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జెసి ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్ఒ సత్యనారాయణరావు ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రభుత్వం నిర్దిష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ప్రజలు తమ బాధలు చెప్పుకోవడానికి ఏకైక మార్గం ఈ వేదిక ఈ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలిన్నారు. సమస్య పరిష్కారానికి సంబంధించి ప్రతి శాఖ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఒపి) రూపొందించి తదుపరి వారంలోగా సమర్పించాలిన్నారు. తరచుగా తమ శాఖకు సంబంధించి ఎలాంటి సమస్యలు వస్తాయి, దాని పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి, అది ఏ స్థాయిలో పరిష్కరించడానికి అవకాశం ఉందని దరఖాస్తుదారుతో మాట్లాడాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలిన్నారు. ఇందుకు నిర్దిష్ట కాల పరిమితి దృష్టిలో ఉంచుకోవాలిన్నారు. ఒకవేళ కోర్టు పరిధిలో ఉంటే అందుకు తగినట్లు చర్యలు తీసుకోవడం చేయాలి అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఎ పరిధిలోకి వెళ్లకుండా నిర్ణీత కాల వ్యవధిలోపు నాణ్యతగా పరిష్కరించాలిన్నారు. పెండింగ్ దరఖాస్తులు రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి లాగిన్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం అర్జీదారులనుండి వారు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చర్చి బంగ్లా కూల్చివేతకు యత్నం

- అడ్డుకున్న చర్చి వర్గాలు
- పలువురిపై దాడి.. ముగ్గురికి గాయాలు
- ప్రధాన రహదారిలో ధర్నా
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే


చర్చి ముందు భాగం కూల్చివేత

ప్రజాశక్తి-రైల్వేకోడూరు
రైల్వేకోడూరు దక్షిణాంధ్ర లూథరన్ చర్చి ఆవరణంలో ఉన్న బ్రిటిష్ కాలంలో నిర్మించిన బంగ్లాను ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో కూల్చివేసేందుకు కొందరు వ్యక్తులు మందీ మార్బలంతో వచ్చారు. మొదట చర్చి ప్రహరీ గోడను కూల్చివేశారు. తర్వాత బంగాళా ముందు భాగం కప్పును జెసిబి యంత్రాలతో తొలగిస్తుండగా చర్చి వర్గాలు గమనించి అడ్డుకున్నారు. రెండు గ్రూపుల వారు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో చర్చి వర్గాలకు చెందిన కనుపర్తి చంద్రయ్య, రత్నం, మేరీలకు గాయాలయ్యాయి. వీరిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అంతకుముందు చర్చి వర్గాలు అల్లూరి సీతారామరాజు విగ్రహం ప్రధాన రహదారిలో రెండు గంటలపాటు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ట్రాఫిక్ స్తంభించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చర్చి బంగళాను కూల్చి వేస్తున్నారని పోలీసులకు విన్నవించినా పట్టించుకోలేదని చర్చి వర్గాలు ఆరోపించారు. ఆలస్యంగా పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ సందర్భంగా చర్చి సంఘం నాయకులు భాను, భాస్కర్ తదితరులు మాట్లాడుతూ 150 సంవత్సరాల కిందట చర్చిని నిర్మించారని తెలిపారు. చర్చి పక్కనే సేవకులు నివాసం ఉండేందుకు బంగాళాను నిర్మించారన్నారు. ఈ బంగాళాలో అమెరికాకు చెందిన లిలియన్ మేయర్, జోయల్ మేయర్ అనేవారు చాలాకాలం ప్రజా సేవ చేశారని తెలిపారు. గతంలో చర్చి ఆస్తులను అమ్మకం పెట్టినప్పుడు అనేక పోరాటాలు చేశామన్నారు. అయినా కొన్ని ఆస్తులను అమ్మేశారని ఆరోపించారు. చర్చి ఆస్తుల వ్యవహారంలో రెండు వర్గాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. ఒకరు అమ్మాలని ఇంకొకరు అమ్మకూడదని ఇలా చాలాకాలంగా వివాదాలు జరుగుతున్నాయన్నారు. చర్చి బంగళాను అర్ధరాత్రి కూల్చడానికి కారణం ఏమిటి అని ప్రశ్నించారు. చర్చి బంగాళాను కూల్చడానికి వచ్చిన వ్యక్తి గతంలో చర్చి ఆస్తులను మింగేసాడని తెలిపారు. అర్ధరాత్రి సమయంలో మంది మార్బలంతో జెసిబిలతో వచ్చి చర్చి వర్గాలను భయభ్రాంతులకు గురిచేయడం ఎంతవరకు సబబన్నారు. బంగాళా, స్థలాన్ని ఎవరు అమ్మారని ప్రశ్నించారు. జరిగిన సంఘటనపై పోలీసులు ఉన్నత స్థాయి విచారణ నిర్వహించి తమకు న్యాయం చేయాలని, దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని చర్చి వర్గాలు డిమాండ్ చేశారు. ఇది ఇలా ఉండగా విషయం తెలుసుకున్న రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టిడిపి యువ నాయకులు సాయి వికాస్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తక్షణం కూల్చివేతకు వచ్చిన వారిపై కేసులు నమోదు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని, ఆస్తులను కాపాడుతామని ఆయన చర్చి వర్గాలకు హామీ ఇచ్చారు. చర్చి వర్గాలకు భద్రత కల్పిస్తామని తెలిపారు.


చర్చి బంగ్లా కూల్చివేత గురించి విచారిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, సాయి వికాస్‌రెడ్డి


దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రత్నం, చంద్రయ్య

జిల్లాకు మంచిపేరు తేవడం గర్వకారణం : కలెక్టర్


విద్యార్థులకు ప్రశంసా పత్రం అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి
రాష్ట్ర స్థాయిలో విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల మార్చ్ ఫాస్ట్‌లో ప్రతిభ చూపిన జిల్లా స్కౌట్ విద్యార్థులను సోమవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో కలెక్టర్ శ్రీధర్ చామకూరి ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి కలెక్టర్ ద్వారా అభినందనలు పొందిన వారిలో రామసముద్రం మండలం ఎపి మోడల్ స్కూల్ స్కౌట్ విద్యార్థి ఎస్.నిజాముద్దీన్, గాలివీడు మండలం నూలివీడు జిల్లా పరిషత్ హైస్కూల్ గైడ్ విద్యార్థినిలు భవిత, నసీబ్ ఉన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్కౌట్ విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించుకొని రోల్ మోడల్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో జరిగిన మార్చ్ ఫాస్ట్‌లో ప్రతిభ చూపి జిల్లాకు పేరు తేవడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు తన కార్యాలయంలో ప్రతిభ చూపిన స్కౌట్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయిలో మార్చ్ ఫాస్ట్‌లో ప్రతిభ చూపి రాష్ట్ర డిజిపి ద్వారక తిరుమలరావు నుంచి ప్రశంసా పత్రాలు పొందడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర, స్కౌట్ మాస్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.


లే అవుట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి, సబ్ కలెక్టర్

ఆర్ఆర్ లేఅవుట్‌ను సుందరంగా తీర్చిదిద్దుతాం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి
మంగంపేట ముంపు బాధితులకు కేటాయించిన ఆర్ఆర్-5 లేఅవుట్ అత్యంత సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. సోమవారం ఓబులవారిపల్లి మండలంలోని మంగంపేట గ్రామ పంచాయతీ కాపువల్లి, అరుందతివాడ, దళితవాడ ముంపు బాధితులకు కేటాయించిన ఆర్ఆర్-5, లే అవుట్‌ను రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌తో కలిసి కలెక్టర్ శ్రీధర్ చామకూరి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంగపేట ముంపు బాధితులకు ప్రభుత్వ పరంగా పూర్తి సహాయ సహకారాలు అందించి ఆదుకుంటామని పేర్కొన్నారు. మంగంపేట గ్రామ పంచాయతీ కాపువల్లి, అరుందతివాడ, దళితవాడ గ్రామాలలో గ్రామస్తుల కోరిక మేరకు లేఅవుట్లో అన్ని మౌలిక వసతులు కల్పించి సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ లేఅవుట్‌లో సిసి రోడ్డు, డ్రైనేజ్, అంగన్వాడీ స్కూల్ బిల్డింగ్, ప్లే గ్రౌండ్, పార్క్ తదితర మౌలిక వసతులన్నీ లేఅవుట్‌లో కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుతం రోడ్డు కరెంటు సప్లై పూర్తి చేశామన్నారు. కాపువల్లి, అరుందతివాడ, దళితవాడ గ్రామాలను ఆహ్లాదకరమైన వాతావరణం కలిగి సురక్షితమైన ప్రాంతాలకు తరలించడం జరుగుతోందన్నారు. పైమూడు గ్రామాలకు సంబంధించి దాదాపు 570 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని తహశీల్దార్‌కు సూచించారు. లే అవుట్‌కు నాలుగు మూలల స్టోన్స్ జాగ్రత్తగా వేయాలన్నారు. అనంతరం కలెక్టర్ లే అవుట్‌కు సంబంధించి వివిధ అంశాలపై సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా చర్చించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాజంపేట సబ్ కలెక్టర్ నైదియ, తహశీల్దార్ పీర్ మున్నీ, సర్వేయర్‌లు, ఎపిఎస్‌పిడిసిఎల్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

'మానవత' సేవలు అభినందనీయం : ఎస్ఐ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్
రాష్ట్ర వ్యాప్తంగా మానవత సేవా సంస్థ వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని పట్టణ ఎస్ఐ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. మానవత సేవా సంస్థ వారోత్సవాలలో భాగంగా సోమవారం ఆర్అండ్‌బి బంగ్లా నుండి మానవత అధ్యక్షులు శ్రీనివాసులు నాయుడు, కార్యదర్శి నంద కిషోర్, కోశాధికారి బొట్టా రామచంద్ర నాయుడు ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పాత బస్టాండు కూడలి మీదుగా కర్ణాటం లాడ్జి, జిఎంసి వరకు కొనసాగించారు. ఫ్యూచర్ మైండ్స్ పాఠశాల విద్యార్థులు ర్యాలీలో పాల్గొని అందరికీ ఆత్మీయంగా ఆహ్వానం పలికారు. సంస్థ చేపడుతున్న సేవలు, సమాజం పట్ల ప్రజలు చూపించాల్సిన ఆదరణ, పలు విషయాలపై ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి పాల్గొని సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ ముఖ్యులు తుంగా రమణారెడ్డి, పతకమూరి వెంకటరమణ, శివరాజు, బద్వేల్ సుబ్బరాయుడు, లయన్ అబ్దుల్లా, హెల్పింగ్ హాండ్స్ రమణ, శ్రీనివాసులు, వై.కృష్ణమూర్తి, పోకల ప్రభాకర్, రామానుజులు, కలేశా, శివశంకర్, గంగాధర్, పి.రాయుడు, సిఎన్.మూర్తి, ముజీబ్ పాల్గొన్నారు.

వినియోగదారుల ఫోరం ఏర్పాటు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : రాజంపేటలో సోమవారం రాయలసీమ జోన్ వినియోగదారుల పోరం అధ్యక్షులు మేకల దర్బార్ బాష ఆధ్వర్యంలో నియోజకవర్గం వినియోగదారుల ఫోరం ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా దార్ల శ్రీనివాసులుఆచారి, ఉపాధ్యక్షుడిగా పెయ్యాల శివ, ఉపాధ్యక్షుడిగా ఆలీ అక్బర్ ఆలీ షేర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వైఖోం నైదియాదేవిని మర్యాదపూర్వకంగా కలిసి ఫైల్‌ను అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మేకల దర్బార్‌బాష మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు తిరుపాల్ ఆదేశాల మేరకు రాజంపేట, రాయచోటి, మదనపల్లెల్లో నియోజకవర్గం వినియోగదారుల ఫోరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వినియోగదారుల హక్కులను కాపాడాలని, 1986లో చట్టం అమలులోకి వచ్చిందన్నారు. ఈ చట్టాన్ని 2019లో మార్పులు చేసి వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టంగా రూపొందించారన్నారు. వినియోగదారులు రాయితీలు, ఉచిత ప్రకటనలను ఆన్‌లైన్‌లో చూసి మోసపోవద్దన్నారు. ఇలాంటి మోసాలను హ్యాకర్లు గుర్తించి దోచేస్తారని, పాస్‌వర్డులను సులువుగా పెట్టుకోవద్దని, ఓటీపీలను ఇతరులతో పంచు కోవద్దన్నారు. కొనుగోలు చేసిన వస్తువు తయారీ, చిరునామా, గడువు తేదీ, కస్టమర్ కేర్ నంబరు సరి చూసుకోవాలని సూచించారు. డిజిటల్ పేమెంట్, క్యూఆర్ కోడ్, మొబైల్ యాప్ ద్వారా చెల్లింపులు జరిపే ముందు వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు విత్తనాలు, మందులు కొనేటప్పుడు బోగస్ కంపెనీల పట్ల జాగ్రత్తగా ఉండాలని, తప్పకుండా రశీదు పొందాలని సూచించారు. మోసానికి గురైతే కన్జ్యూమర్ ఫోరంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.


సబ్ కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఫోరం సభ్యులు

లక్ష్మీ నరసింహ స్వామి రాజగోపురానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్
పట్టణ సమీపంలోని భువనగిరిపల్లెలో వెలసినయున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ రాజగోపుర నిర్మాణానికి సోమవారం భువనగిరిపల్లె గ్రామానికి చెందిన ఆకుల సుబ్బ నరసింహులు రూ.1,00,116 విరాళం ఆలయ ధర్మకర్తలకు అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ధర్మకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి పూల హరిప్రసాద్, కంబాయి గారి నరసింహులు, కావేరిగారి వెంకటరమణ పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న ఆకుల సుబ్బ నరసింహులు

'నవోదయ'లో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-రాయచోటి: కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక విద్యాసంస్థ జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నవోదయ విద్యాలయ సమితి స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ జిల్లాకు విజ్ఞప్తి లేఖ పంపారన్నారు. జిల్లా నందలి ఆసక్తి గల విద్యార్థులు చివరి తేదీ సెప్టెంబర్ 16లోగా http://navodaya.gov.inలో రిజిస్టర్ చేసుకొని ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులు సమర్పించాలన్నారు. 2025 జనవరి 18న ఎంపిక పరీక్ష ఉంటుందన్నారు. జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి ఏదేని ఇతర వివరాలకు ప్రిన్సిపల్, జవహర్ నవోదయ విద్యాలయ, వలసపల్లె-517325, మదనపల్లె, అన్నమయ్య జిల్లా, మొబైల్ నెంబర్ 8247702733 వారిని సంప్రదించాలని పేర్కొన్నారు.

భూ బాధితులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : నియోజకవర్గంలోని ప్రభుత్వ భూములు, పేదల భూములను కాపాడాలని సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం మదనపల్లె సబ్ కలెక్టర్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కె.మురళి మాట్లాడుతూ మదనపల్లి పట్టణం, పట్టణానికి ఆనుకుని ఉన్న రెవెన్యూ పంచాయతీలలో రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములు చెరువులు, వాగులు, వంకలు, కబ్జా అయ్యాయని గతంలో రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ రికార్డులను నిప్పు పెట్టిన నిందితులను ఇప్పటివరకు పట్టుకున్న పరిస్థితి లేదన్నారు. ఈ సంఘటన జరిగే దాదాపు నెల కావస్తున్న ఏ ఒక్క భూకబ్జాదారున్ని అరెస్టు చేసిన పరిస్థితి లేదని, ప్రభుత్వం ఈ సంఘటనపై మొదట కనపరిచిన చొరవ ఇప్పుడు చూపించడం లేదని విమర్శించారు. కబ్జాదారులతో ప్రభుత్వం మిలాకత్ అయిందనే అనుమానాలు వ్యక్తమవుతు న్నాయన్నారు. భూ బాధితులు పెట్టుకున్న నమ్మకాలు గాలికి పోయేలాగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం కొండను తవ్వి ఎలకను పట్టలేదన్నారు. ప్రభుత్వం భూబాధితులకు న్యాయం చేయకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో నాయకులు మాధవ్, తిరుమల, సూరి, కమలాకర్ పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కలిసికట్టుగా సమన్వయంతో పనిచేద్దాం : 'చమర్తి'


జగన్‌మోహన్‌రాజును గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్
అందరూ కలిసికట్టుగా సమన్వయంగా పనిచేయాలని రాజంపేట టిడిపి పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు టిడిపి నేతలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం చమర్తి జగన్ మోహన్ రాజును గుండ్లూరు మాజీ సర్పంచ్ ముమ్మిడి మదన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి టిడిపి నాయకులు ఘనంగా గజమాలతో సత్కరించారు. ఈసందరరేగా చమర్తి మాట్లాడుతూ కలిసికట్టుగా సమన్వయంతో పనిచేద్దామని, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సమస్యలన్నిటిని సామరస్యంగా పరిష్కరించుకుందామని, ఎల్లప్పుడు కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, ఏ సమస్య ఉన్నా తన ద ృష్టికి తీసుకురావాలని నేతలకు సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముమ్మిడి మదన్ మోహన్‌రెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ జల్లి సుబ్రహ్మణ్యం, మాజీ నీటి సంఘం చైర్మన్ ముమ్మిడి వేణుగోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు నూక చంగల్ రెడ్డి, గంగా బాబుల్ రెడ్డి, సయ్యద్ గఫూర్, మలిశెట్టి శివకుమార్, పొత్తపి హరిబాబు, టిడిపి నాయకులు ఇండ్లూరు వీరయ్య, పగిడి కాలువ బుజ్జి, సయుద్ అహ్మద్ బాషా, గాదిరాజు వెంకట సుబ్బరాజు, సంగరాజు సురేష్ కుమార్ రాజు, శివప్రసాద్ యాదవ్, చింటు, తదితరులు పాల్గొన్నారు.


బిఎస్ ఫ్యాషన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, సాయివికాస్‌రెడ్డి

బిఎస్ ఫ్యాషన్స్ ప్రారంభం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అనంతంపల్లి పంచాయతీ రెడ్డిపల్లె ఆర్ఎస్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బిఎస్ ఫ్యాషన్స్ మునగాల బాలాజీ ఆహ్వానం మేరకు స్థానిక ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్, రైల్వే కోడూరు నియోజవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానంద రెడ్డి తనయుడు సాయివికాస్‌రెడ్డి ముఖ్య అతిథులకు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలాజీ సాయివికాస్‌రెడ్డి, గజపతి, ఎమ్మెల్యేను దుశ్శా లువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకుడు పసుపులేటి వెంకట రమణ, టిడిపి నాయకుడు పల్లపు జనార్ధన కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్

ప్రజాశక్తి-నందలూరు


కలకడ : తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క

మండలంలోని శ్రీ అన్నమాచార్య అకాడమీ పాఠశాలలో ఘనంగా రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం రాఖీపౌర్ణమి సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యా యుడు ఏనుగుల బాలాంజ నేయులు, డైరెక్టర్లు మాడపూరి హేమలత, సమ్మెట ఉమా, మహేష్ లు రక్షాబంధన్ విశిష్టతను విద్యార్థులకు తెలిపారు. అనంతరం పాఠశాలలోని అన్నా చెల్లెల్లు, అక్క తమ్ముళ్లకు వారిచే రాఖీ కట్టిం చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు .**వీరబల్లి :** సోదర సోదరీ మణుల మధ్య ప్రేమ, ఆప్యాయతలకు చిహ్నంగా నిలిచే రాఖీ పండుగను మండలంలోని ప్రజలంతా ఆనం దోత్సాహాల మధ్య వైభవంగా జరుపుకున్నారు. ప్రతీ ఇంట్లో సోదరి మణులు తమ సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించుకొని అప్యాయతను చాటారు. యువతులు, మహిళల సందడితో ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంది. **కలకడ:** మండలంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చెల్లెల్లు అన్నలకు, అక్కలు తమ్ముళ్లకు రాఖీలు కట్టి ఎల్లవేళలా మీ వెంట ఉంటామంటూ భరోసానిచ్చారు.


విసి గోపాల్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

ఉద్యాన విశ్వవిద్యాలయ విసికి సన్మానం

ప్రజాశక్తి-రైల్వే కోడూరు

డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ విసిగా నియమితులైన డాక్టర్ కె.గోపాల్ ను అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీ ఇన్‌ఛార్జి విసిగా బాధ్యతలు చేపట్టిన గోపాల్ సోమవారం తొలిసారిగా అనంత రాజు పేట ఉద్యాన కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపాల్ మాట్లాడుతూ వర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వర్సిటీ అభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా పని చేస్తానని పేర్కొన్నారు. అందరి సహకారంతో వర్సిటీ ని ముందుకు నడిపిస్తానని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ అసోసియేట్ డీన్ డాక్టర్ పి.టి.శ్రీనివాస్, ఒ.ఎస్.ఏ డాక్టర్ సయ్యద్ సదరుల్లిష్షా, జోనల్ రీసెర్చ్ హెడ్ డాక్టర్ కే.టీ వెంకట రమణ, విసి సతీమణి లీలావతి, ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రత్నం, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రేమ జంటకు వివాహం

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని నూలివీడుకు చెందిన ఉజ్జలరెడ్డి భాస్కర్, అరవ దాసరి జయశ్రీలు కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇరువురు మేజర్లు కావడంతో ఎస్‌పిని కలిసి అక్కడా వివాహం చేసుకొని రిజిస్టర్ చేయించుకొని తహశీల్దార్ భాగ్యలత దగ్గర నమోదు చేసుకున్నట్లు చెప్పారు. తమ కుటుంబ పెద్దల అంగీకారం లేకుండా మేము ఇష్టపడి వివాహం చేసుకున్నామని, పోలీసులు తమకు రక్షణ కల్పించాలని కోరారు.

రామాలయం నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్

పట్టణంలోని 24వ వార్డు గాంధీపురంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా రామాలయం నిర్మాణానికి భూమి పూజ చేశారు. రామాలయ నిర్మాణం ఈ ప్రాంత వాసులకు ఎన్నో ఏళ్ళ కలగా ఉండేది. వార్డు ఇన్‌ఛార్జ్ తలారి రాధమ్మ పట్టువదలని విక్రమార్కుడి లా చేసిన కృషి ఫలించింది. ఎట్టకేలకు టిడిపి నుంచి రూ.8 లక్షల నిధులు మంజూరు కావడంతో సోమవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధి కోసం మాజీ కౌన్సిలర్, ఇన్‌ఛార్జ్ రాధమ్మ అలుపెరుగని పోరాటం చేస్తోందని అన్నారు. ఈ వార్డులో ఏ అవసరం తాను ముందుంటానని పేర్కొన్నారు.

చిన్నారులు, వృద్ధులకు అల్పాహారం

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్

స్థానిక అమ్మచెరువుమిట్టలోని వెలుగు సంస్థలో సోమవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మదనపల్లె ఫోటోగ్రాఫర్ అండ్ వీడియోగ్రాఫర్ అసోసియేషన్ విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులు, చిన్నారులకు ఉదయం అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి విభిన్న ప్రతిభా వంతులు, వృద్ధులకు వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సేవలు ఎనలేనివని కొని యాడారు. మనం ఎన్ని ఉన్న అందరూ చూపించే వారు ఫోటోగ్రాఫర్లని, ఈ ప్రపంచ ఫోటో గ్రఫీ దినోత్సవం సందర్భంగా అభినం దించారు. ఫొటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ వారు అందరు కలిసి సేవాభావంతో వెలుగు చిన్నారులకు, వృద్ధులకు టిఫిన్ ఏర్పాట్లు చేయడం హర్షనీ యమన్నారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ శివ ప్రసాద్, ఫోటోగ్రాఫర్ అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు, వెలుగు కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్ పి.లీలాకుమారి, సోషల్ వర్కర్ యం.గీత, వెలుగు సిబ్బంది, చిన్నారులు, వృద్ధులు పాల్గొన్నారు.


అల్పాహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

యాజమాన్య పద్ధతులతో అధిక లాభాలు

-కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల

ప్రజాశక్తి-కలికిరి


పంటలను పరిశీలిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే అధిక లాభాలు సాధించ వచ్చునని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. సోమవారం మేడికుర్తి పంచాయతీలోని ఎద్దులవారిపల్లిలో పిలక దశలో ఉన్న వరి, ఊడల దశలో ఉన్న వేరుశనగ పొలాలను శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు. వరిలో పొటాష్ ,జింకు లోపాల లక్షణాలను గమనించారు. వాటి నివారణకు గాను 13.0.45 లీటరు నీటికి 5 గ్రాములు కలిపి పిచికారి చేసిన వారం తర్వాత జింక్ సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. అలానే కొన్ని వరి పొలాల్లో అగ్గి తెగులు లక్షణాలైనా ఆకులపై ముదురు గోధుమ రంగు అంచుతో మధ్యలో బూడిద రంగు గల నూలు కండె ఆకారపు మచ్చలు గమనించామని తెలిపారు. అగ్గి తెగులు పొలం గట్టు చివర్ల మొదలై లోపలికి వ్యాపించడాన్ని రైతులకు చూపించారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉందని చెప్పారు. రాత్రి వేళల్లో కొద్దిగా మంచుతో ఉష్ణోగ్రతలు తక్కువగా, పగటి పూట ఎక్కువ ఉష్ణోగ్రతలు ఈ వారంలో రికార్డు అవు తున్నాయని అన్నారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సిఫారసు చేశారు. కొన్ని వేరుశనగ పొలాల్లో కూరచబడిన మొక్కలు ఎక్కువ కొమ్మలు కలిగి, చివరన లేత ఆకు పచ్చ చిన్న ఆకులు లక్షణాలు కల మొవ్వు కుళ్ళు వైరస్ తెగుళ్ళ, ఎండిన మొవ్వు, ఊడలు, కాయలపై నల్లటి మచ్చలు లక్షణాలు కల్గిన కాండం కుళ్ళు వైరస్ తెగులు ఎక్కువ తీవ్రతగా ఉన్నాయని తెలిపారు. పొలాల పక్కన సాగు చేయకుండా కయ్యలు ఉన్నాయని, విరివిగా కలుపు మొక్కలు విస్తరించి ఉన్నాయని వేరుశనగ మొక్కల సాంద్రత కూడా చాలా తక్కువగా ఉండటం కారణాల వల్ల రైతులు విత్తన శుద్ధి చేసి విత్తిన తరువాత, పంట 20 రోజుల దశలో రసం పీల్చు పురుగులకు కీటక నాశినిని పిచికారి చేసిన కూడా వైరస్ ఉధృతి అలాగే ఉందన్నారు. ఈ వైరస్ నివారణకు గాను గట్లపై చుట్టూ వయ్యారిభామ మొక్కలను తీసి వాటిని కాల్చివేయాలని, తెగులు సోకిన వేరుశనగ మొక్కలను కూడా తీసి కాల్చివేయాలని సూచించారు. రసం పీల్చే పురుగుల నివారణకు పిచికారి చేసేటప్పుడు గట్ల మీద ఉన్న గడ్డి మీద కూడా పిచికారి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు శ్రీ సోము శేఖర్‌బాబు, కె.మాధురి, వై.పీరుసాహెబ్, రైతులు పాల్గొన్నారు.

కమనీయం..లక్ష్మీనరసింహస్వామి కల్యాణం


నారాయణ నెల్లూరులో వైభవంగా నిర్వహిస్తున్న స్వామివారి కల్యాణం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నారాయణ నెల్లూరు కొండపై వెలసిన ఆలయంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల నడుమ కమనీయంగా జరిగింది. దీంతో నారాయణ నెల్లూరు లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వేలాది మంది భక్త జనంతో శోభిల్లింది. ముందుగా లక్ష్మీదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామి వార్లను ఆలయ ప్రధాన అర్చకులు సరసా సాయిస్వామి ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక వస్త్రాధారణ, పుష్ప అలంకరణలో కొలువు తీర్చి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై తీసుకొచ్చి సంప్రదాయ బద్ధంగా కళ్యాణాన్ని నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవ ఘట్టాన్ని అడుగడుగునా భక్తులకు వివరిస్తూ కళ్యాణం నిర్వహించడం పట్ల భక్తులు భక్తిశ్రద్ధలతో కల్యాణాన్ని తిలకించి పరవశించారు. కల్యాణ అనంతరం భక్తులు ఎవరికి తోచిన రీతిలో వారు శక్తిని బట్టి స్వామివారికి చదివింపులు చదివించారు. భక్తులందరికీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాదాలు, మజ్జిగ పంపిణీ చేశారు. దీంతో నారాయణ నెల్లూరు గ్రామంలో ప్రత్యేక పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో కల్యాణ దాత భీము రాజశేఖర్ రెడ్డి, రాజేశ్వరి దంపతులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ నిర్మాణానికి కృషిచేసిన నిర్మాణ కర్తలు, విరాళాలు అందజేసిన దాతలు, నారాయణ నెల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఎగవూరు, ఇసుకపల్లి, హరిజనవాడ, అరుంధతి వాడ, ఎస్టి కాలనీ గ్రామ ప్రజలతో పాటు రాజంపేట చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

'మానవత' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి


మూడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహిస్తున్న మానవత సంస్థ సభ్యులు

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యక్రమాల్లో భాగస్వామ్యులు కావాలని లక్కిరెడ్డిపల్లి తహశీల్దార్ లక్ష్మీప్రసన్న, ఎస్ఐ రవీంద్రబాబు పేర్కొన్నారు. మానవత సంస్థ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శాంతియుత ర్యాలీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు వెలకట్టలేని ప్రతి ఒక్కరు కూడా సేవలలో భాగస్వామ్యంలో కావాలని అన్నారు. లక్కిరెడ్డిపల్లి నలంద స్కూల్ దగ్గర ఎస్ఐ రవీంద్రబాబు, మానవత శాంతి ర్యాలీ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో చైర్మన్ ఎ.ఎస్.బాలసుబ్రమణ్య, కేంద్ర కమిటీ సభ్యులు వై.ప్రసాద్‌యాదవ్, ఎన్.సహదేవరెడ్డి, అధ్యక్షులు, ఎస్ఎండి సఫినాయక్, జిల్లా సభ్యులు ఆరె.శివయ్య, హెడ్ కానిస్టేబుల్ రాంప్రసాద్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నలందా హైస్కూల్ నుంచి ప్రారంభమై మిస్పా చర్చి మీదుగా వెళుతూ మనీషా స్కూల్ విద్యార్థులు కలుపుకొని, తరువాత బస్టాండ్ లో విశ్వభారతి స్కూల్ విద్యార్థులతో కలిసి వైఎస్ఆర్ సర్కిల్ దగ్గర మానవత మానవహారం ఎర్పాటు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం దగ్గర శాంతిర్యాలీ ఏర్పాటు చేశారు. తహశీల్దార్, పిన్సిపల్ రాంమోహన్‌రెడ్డి, విద్యాశాఖ అధికారులు చక్రీనాయక్, వెంకటసుబయ్య కో-చైర్మన్ శివశంకర్‌రెడ్డి, జిల్లాసభ్యులు ఇవి.కృష్ణ చైతన్యరెడ్డి, అందరూ మానవతా సేవలు గురించి అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా మానవత సేవలు ఉచిత అబులెన్సు సేవలు, బాడీ ఫ్రిజర్స్, శాంతి రథాలు, విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన, పర్యావర్ణ పరిరక్షణ, రక్తదానం, ఉచిత వైద్య శిబరాలు అనేక సేవలు అందిస్తున్నారు. పోలీసుశాఖ ర్యాలీని పర్యవేక్షించారు. కార్యక్రమంలో నలంద పెద్ద రమణ, సి.విశ్వనాధ్, కిషోర్, మల్లి, ఫిరోజ్, ఉపాధ్యాయలు, ఆటో అలీ, మానవత సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సిఐ గురునాథ్, ఎస్ఐ రామాంజనేయులు

ప్రజాశక్తి-కలకడ

ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలకడ సిఐ గురునాథ్ సూచించారు. ఎస్పి విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు సోమవారం ప్రమాదాల నివారణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అన్న అంశాలపై వాహనదారులకు చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్సులు కలిగి ఉండాలని, పొల్యూషన్ సర్టిఫికేట్ పొంది ఉండాలని అవగాహన కల్పించామన్నారు. ద్విచక్ర వాహనాలలో ఎక్కువ మందిని వేసుకొని ప్రయాణించరాదని, అలా చేస్తే వారికి అపరాధ రుసుములు తప్పవని హెచ్చరించినట్లు తెలిపారు. చిన్నపిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని, వారి లైసెన్సులు రద్దు పరచడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఆటోలు, వాహనదారులు యూనిఫామ్ ధరించాలని తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ పనులు చేయుటకు అధిక కూలీలను వేసుకుని ఆటోలలో ప్రయాణించడం నేరమని అలాంటివి తమ దృష్టికి వస్తే ఆటో నడిపే డ్రైవర్ లైసెన్స్ రద్దు పచడంతో పాటు ఆటో సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రామాంజనేయులు, పోలీసు సిబ్బంది తెలిపారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి-కలకడ

గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక పై సర్పంచులకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఎంపీడీవో పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి గురువారం వరకు అనగా నాలుగు రోజులపాటు శిక్షణ తరగతులు ఉంటాయని ఆయన తెలిపారు. 2024-25 వ సంవత్సరమునకు సంబంధించిన పునరుద్దరించిన రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ వార్షిక కార్యాచరణ ప్రణాళిక మరియు గ్రామ పంచాయతి అభివృద్ధి ప్రణాళిక 2024-25 కు సంబంధించి మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ఈనెల 19 నుంచి 21 వరకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు పంచాయతీల అభివృద్ధి వనరుల తయారు చేసుకోవడంపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఎంఒటిఎస్‌లు, ఒఆర్‌డిలు పాల్గొన్నారు.

రామసముద్రం : పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు మండల అభివృద్ధి కార్యాలయంలో సోమవారం ఎంపిడిఒ భాను ప్రకాష్ ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలనతో మొదటిరోజు శిక్షణా తరగతులు ప్రారంభించారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలోని సర్పంచ్‌లు, కార్యదర్శులు, రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ నాయక్ శిక్షణ తరగతులు నిర్వహించారు. పారిశుధ్యం, తాగునీరుపై వివరించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సుధాకర్, ఎఒ శ్రీనివాసులు పాల్గొన్నారు.**కలికిరి:** గ్రామపంచాయతీ వ్యవస్థను బలోపేతమే లక్ష్యంగా సర్పంచ్‌లు, కార్యదర్శులు పనిచేయాలని ఎంపిడిఒ గంగయ్య సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యద ర్శులకు మూడు రోజులు పాటు శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. గ్రామ పంచాయతీల అధికారాలు, విధులు, పారిశుధ్యం, తాగునీటి నిర్వహణ, చెత్త నుంచి సంపదను సృష్టించే కేంద్రాల నిర్వహణపై చర్చించారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి పరుశురాం, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

23న గ్రామసభకు డిప్యూటీ సిఎం రాక

- కలెక్టర్ శ్రీధర్ చామకూరి

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌తో కలిసి గ్రామసభ ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 23న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మైసూరువారి పల్లెలో నిర్వహించే గ్రామ సభకు హాజరవుతారని చెనప్పారు. అధికారులకు కేటాయించిన విధులు ప్రత్యేక శ్రద్ధతో జాగ్రత్తగా నిర్వహించి గ్రామసభ విజయవంతం చేయాలన్నారు.ముఖ్యంగా అన్నమయ్య జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయతీల ప్రాంతాలలో చేపట్టవలసిన పనులు, ప్రాజెక్టుల ఆమోదం కోసం ఈనెల 23న గ్రామ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. సందర్భంగా ఇప్పటికే మంజూరు చేయబడిన పనులు,పురోగతిలో ఉన్న పనుల గురించి చర్చించడం జరుగుతుందన్నారు. మైసూరు వారిపల్లె గ్రామపంచాయతీలో అన్ని మౌలిక వసతులు కల్పించి ఒక మోడల్ గ్రామ పంచా యతీగా అభి వృద్ధి చేయడం జరుగుతుందని గ్రామ ప్రజలందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాజంపేట సబ్ కలెక్టర్ నైదియ, డిపిఒ ధనలక్ష్మి, తహశీల్దార్, ఎపిఎం పిడిసిఎల్, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి


విఆర్‌ఒలను సన్మానిస్తున్న తహశీల్దార్ మహేశ్వరిదేవి

విధులను సక్రమంగా నిర్వర్తిస్తేనే గుర్తింపు

ప్రజాశక్తి-కలికిరి

ఉద్యోగులు వారి వారి విధులను సక్రమంగా నిర్వర్తించినప్పుడే పేరు ప్రఖ్యాతలు గుర్తింపు వస్తుందని తహశీల్దార్ మహేశ్వరిబాయ్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కలికిరి విఆర్‌ఒ విశ్వనాథ, చీకటిపల్లి విఆర్‌ఒ నరేష్‌లు కలెక్టర్, సబ్ కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం వారికి అభినం దన సభ ఏర్పాటు చేశారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తమ విధులను సక్రమంగా నిర్వర్తించి ప్రజా సమస్యలను తీర్చినప్పుడే పేరు ప్రఖ్యాతలు వస్తాయని అన్నారు. విఆర్‌ఒలు విశ్వనాథ నరేష్‌లకు పూలమాలవేసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ నవీన్, సర్వేయర్ దేవి, విఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కమార్‌రెడ్డి

కల్యాణ మండపాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని ఫతేగడ పంచాయతీ పాలెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ అంకాలమ్మ కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, సతీమణి తనూజరెడ్డిలు సోమ వారం ప్రారంభించారు. ఉదయం నుంచి గణపతి పూజ, వాస్తుపూజ, శివపార్వతుల కళ్యాణం, శాంతి ఆయుష్ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాల్లో పాల్గొని పౌరోహితులు అందించిన తీర్థప్రసాదాలు వారు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫతేగడ గ్రామంలో పేద ప్రజల కోసం ఈ కల్యాణ మండపం ప్రారంభించడం జరిగిందని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్య క్రమంలో నల్లారి లక్ష్మీకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, మల్‌రెడ్డి, రాజంపేట టిడిపి పార్లమెంట్ కార్యదర్శి చంద్ర, ఫతేగడ్ సర్పంచ్ రెడ్డమ్మ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొట్టేళ్ల దాడిలో మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-ములకలచెరువు


చికిత్స పొందుతున్న సిద్ధమ్మ

పొట్టేళ్ల దాడిలో మహిళ తీవ్ర గాయపడ్డ సంఘటన ములకలచెరువు మండలంలో వెలుగు చూసింది. ఘటనపై బాదితురాలి కుటుంబ సభ్యులు, మదనపల్లె సర్వజన భోధన ఆస్పత్రి ఔట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని బురకాయలకోట పంచాయతీ, ఎర్రగుడివారి పల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి భార్య సిద్ధమ్మ(55) గొర్రెలను మేపుకొని జీవనం సాగిస్తోంది. గొర్రెల మందలో రెండు పొట్టేళ్ళు పోట్లాడుకుంటుండగా వెళ్లి అడ్డుకోవడంతో పొట్టేళ్ళు ఆమె మీదనే దాడి చేయడంతో కాళ్ళ, చేతులు విరిగి తీవ్రంగా గాయపడింది. కుటుంబీకులు వెంటనే బాదితురాలిని చికిత్స కోసం 108లో మదనపల్లె సర్వజన బోధనాసుఅస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి, మెరుగైన వైద్యం అందించారు. బాధితురాలు ప్రాణాపాయం తప్పి కోలు కుంటోంది.

క్రైం కార్నర్


డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

చోరీ : నగలు, నగదు అపహరణ

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రం సుండుపల్లిలోని సిండికేట్ బ్యాంకు వెనుక వీధిలో నాగేంద్ర అనే వ్యక్తి చెందిన ఇంటిలో చోరీ జరిగిందని రాయచోటి రూరల్ సిఐ తులసిరామ్ పేర్కొన్నారు. ఈ చోరీలో దుండగులు రెండు బంగారు గాజులు, నాలుగు ఉంగరాలు దోచుకెళ్లినట్లు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ రమణ కలిసి డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేసినట్లు చెప్పారు. నాగేంద్ర పారామెడికల్ కాలేజీలో వైస్ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారని వారు ఇంటిలో లేని సమయంలో ఈ దొంగతనం జరిగిందని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని చెప్పారు.

మహిళ ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రమైన పాత రామాపురంకు చెందిన కొరివి జయశ్రీ ఇంటి నుంచి వెళ్లిపోవడంతో ఆమె భర్త గంగాధర కనిపించలేదని ఈనెల 15న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడంతో ఆమె ఫోన్ కాల్ డేటా ప్రకారంగా సుండుపల్లి మండలం సానిపాయిలో ఉన్నట్లు ఫోన్ డేటాలో తెలియడంతో వెంటనే రామాపురం ఎస్ఐ సిబ్బందితో వెళ్లి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. రామాపురం పోలీసులు స్టేషన్‌కు తీసుకు వచ్చినట్లు ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు. వెంటనే ఆమె భర్త గంగాధరకు సమాచారం అందించి అప్పగించినట్లు ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్‌శర్మ పాల్గొన్నారు.


జయశ్రీని భర్తకు అప్పగిస్తున్న ఎస్ఐ